సాక్షి నల్లగొండ

శనివారం । 24 । జూన్ । 2023



కన్నోళ్లకు కడుపుకోత

పాములపహాడ్‌లో పిడుగు పడి ఓ యువకుడు మృతిచెందడంతో అతడి తల్లిదండ్రుల రోదన కంటతడి పెట్టిస్తోంది. - 10లో



జేఎన్‌వీ ఫలితాలు వెల్లడి

చలకుర్తిలోని జవహర్ నవోదయ విద్యాలయం (జేఎన్‌వీ)లో 6వ తరగతి ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. - 12లో

గరిష్టం/కనిష్టం 35°/25°

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

నేడు డయల్ యువర్ ఆర్‌ఎం

నల్లగొండ రూరల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యలు, సలహాల కోసం డయల్ యువర్ ఆర్టీసీ ఆర్‌ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్‌ఎం శ్రీదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు 86881 95076 నంబర్‌కు ఫోన్ ద్వారా సమస్యలు తెలియజేస్తూ, సలహాలు ఇవ్వాలని ఆమె పేర్కొన్నారు.

సగటున 16.3 మి.మీ వర్షం

నల్లగొండ అగ్రికల్చర్ : నైరుతి రుతుపవనాల ప్రభావంతో జిల్లాలోని 31 మండలాల్లో వర్షం కురిసింది. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలో సగటు వర్షపాతం 16.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. అత్యధికంగా నకిరేకల్ మండలంలో 44.1 మిల్లీమీటర్లు, కనగల్ 43.6, తిరుమలగిరిసాగర్ 38.4, చింతపల్లి 28.8, మర్రిగూడ 28.0, నాంపల్లి 27.2, నార్కట్‌పల్లి 26.5, శాలిగౌరారం 25.5, కట్టంగూర్ 21.7, నిడమనూర్ 20.9, చిట్యాల 18.0, దేవరకొండ 16.4, కేతేపల్లి 14.9, అనుముల 14.1 పెద్దవూర 14.1, మునుగోడు 13.8, అడవిదేవులపల్లి 13.2, దామరచర్ల 12.9, నల్లగొండ 11.5, త్రిపురారం 10.9, పీఏపల్లి 10.7, చండూర్ 9.5, మిర్యాలగూడ 8.9, తిప్పర్తి 8.4, కొండమల్లేపల్లి 7.9, వేములపల్లి 5.7, నేరెడుగొమ్ము 4.0, గుర్రంపోడు 2.6, చందంపేట 1.9, మాడ్గులపల్లి 1.5, గుండ్లపల్లి మండలంలో 1.0 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రామగిరి(నల్లగొండ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని బీసీ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక ప్రాతిపదిక బోధించేందుకు ఉపాధ్యాయులు, అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని ఆర్‌సీఓ షకీనా శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. హిందీ, ఇంగ్లిష్, గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, సాంఘిక శాస్త్రం సబ్జెక్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. సంబంధిత సబ్జెక్టుల్లో పీజీ, బీఈడీ చేసిన వారు ఈనెల 27వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కనగల్ (నల్లగొండ) 79934 56805, అనంతగిరి(సూర్యాపేట) 79934 56808, ఎస్ఓఈ (యాదాద్రి భువనగిరి) 94404 20159 ఫోన్ నంబర్లను సంప్రదించాలని సూచించారు.

రుణమాఫీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్నసాగర్

నల్లగొండ టౌన్ : రూ.లక్ష లోపు ఉన్న రైతుల రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక దొడ్డి కొమురయ్య భవన్‌లో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం 2018 సంవత్సరలలో రుణమాఫీ చేస్తామని ప్రకటించి నేటికీ అమలు చేయలేదని విమర్శించారు. వెంటనే రుణమాఫీ నిధులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో వీరేవల్లి వెంకటేశ్వర్లు, కున్‌రెడ్డి నాగిరెడ్డి, ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, బండ శ్రీశైలం, కందాల ప్రమీల, అశోక్‌రెడ్డి, కృష్ణారెడ్డి, వెంకటరమణారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఊర్మిళ, ఎర్రానాయక్ తదితరులు పాల్గొన్నారు.

నీలగిరిలో ఒలింపిక్ డే రన్



ఒలింపిక్ రన్‌ను ప్రారంభిస్తున్న హాఫీజ్‌ఖాన్

నల్లగొండ టౌన్ : ఒలింపిక్ డే సందర్భంగా శుక్రవారం నల్లగొండలో ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎన్జీ కళాశాల మైదానం నుంచి ఇండోర్ స్టేడియం వరకు ఒలింపిక్ రన్ నిర్వహించారు. అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ హాఫీజ్ ఖాన్, జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్, టౌన్ సీఐ గోపి జ్యోతి వెలిగించి రన్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి గొట్టిపాటి కర్తయ్య, బొమ్మపాల గిరిబాబు, ఇమామ్ కరీం, యానాల ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ పుల్లారావు, పుల్లయ్య, వాసుదేవరావు, గంట్ల అనంతరెడ్డి, గోనారెడ్డి, శంభులింగం, రామయ్య, వెంకన్న, శ్రీనివాస్, గార్లపాటి శేఖర్, దాస్, కర్నాకర్, కవిత, శైలజ, ఇద్దయ్య, అలీం తదితరులు పాల్గొన్నారు.

కూలిన కాల్వ బ్రిడ్జి సైడ్ వాల్



నల్లగొండ రూరల్ : నల్లగొండ- కట్టంగూరు ప్రధాన రహదారిపై దండంపల్లి వద్ద పానగల్ రిజర్వాయర్ నుంచి బ్రాహ్మణ వెల్లంలకు వెళ్లే కాల్వ తూము సైడ్ వాల్ శుక్రవారం కూలిపోయింది. బ్రిడ్జి నిర్మాణ సమయంలో వాహనదారులు అదుపుతప్పి కాల్వలో పడిపోకుండా బ్రిడ్జికి ఇరువైపుల సైడ్‌వాల్ నిర్మించారు. వినాయక నిమజ్జనం సమయంలో నల్లగొండ మున్సిపాలిటీ అధికారులు సైడ్ వాల్‌కు సమాంతరంగా మట్టి పోసి విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు అనుకూలంగా మార్చారు. అయితే రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి, కాల్వ నీటి తేమకు మట్టి కుంగిపోయి సైడ్ వాల్ కూలిపోయింది. సైడ్ వాల్ కూలి ప్రమాదకరంగా మారిన వంతెన వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

దండంపల్లి వద్ద కూలిన బ్రిడ్జి సైడ్ వాల్

కొత్తగా 51,803 మందికి రైతుబంధు

- ఈనెల 16వ తేదీ వరకు పాస్ పుస్తకాలు వచ్చిన వారికి పెట్టుబడిసాయం
- నెలాఖరు వరకు దరఖాస్తుకు అవకాశం
- జిల్లాలో భారీగా పెరగనున్న అర్హుల సంఖ్య
- 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లోకి రైతుబంధు సొమ్ము



నల్లగొండ అగ్రికల్చర్ : ఈ వానాకాలం సీజన్‌లో రైతుబంధు 51,803 మంది రైతులకు కొత్తగా అందనుంది. ధరణి సమస్యలు ఒక్కొక్కటిగా పరిష్కారం అవుతుండడంతో పట్టేదారు పాసు పుస్తకాలు జారీ అయిన రైతుల సంఖ్య పెరిగింది. గతేడాది జూన్ నెలతో పోల్చుకుంటే భారీ సంఖ్యలో రైతులకు పాస్ పుస్తకాలు జారీ అయ్యాయి. వానాకాలంలో కొత్తగా రైతుబంధు పొందడానికి ఈనెల 16వ తేదీ నాటికి పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. యాసంగి నుంచి ఇప్పటి వరకు కొత్తగా పాస్‌పుస్తకాల జారీ అయిన రైతుల వివరాలను ఇప్పటికే రెవెన్యూ శాఖ నుంచి వ్యవసాయ శాఖ తీసుకుంది. యాసంగిలో 4,77,728 మంది రైతులకు రైతుబంధు సాయం అందించింది. ఈ సారి కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన 51,803 మంది కలుపుకుని 5,29,531 మందికి ఈనెల 26 నుంచి రైతు బంధు సాయం అందించేందుకు సిద్ధమైంది. అయితే కొత్తగా పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు రైతుబంధు పొందడానికి పాస్ బుక్కు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో ఈ నెలాఖరు వరకు ఏఈఓకు దరఖాస్తులు అందజేయాల్సి ఉంది. ఈ సారి బ్యాంకు ఖాతాలను కూడా మార్చుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది.

నల్లగొండలోనే అత్యధికంగా రైతులు

రైతుబంధు సాయం పొందే రైతులు అత్యధికంగా నల్లగొండ మండలంలో ఉన్నారు. నల్లగొండ మండలంలో 26,339 మంది రైతుల ఖాతాల్లో రైతుబంధు కింద రూ. 31,60 కోట్లు జమ చేసేలా ఏర్పాట్లు చేసింది. ఇక రెండో స్థానంలో గుర్రంపోడు మండలం ఉంది. అక్కడ 25,323 మంది రైతులకు రైతు బంధు లభించనుంది. ఆ తరువాత స్థానంలో మిర్యాలగూడ ఉంది. అక్కడ 23,424 మందికి రైతు బంధు సాయం అందనుంది.

మండలాల వారీగా సాయం అందనున్న రైతుల సంఖ్య

అనుముల	15,196	గుండ్లపల్లి	18,273	మునుగోడు	20,015
గుర్రంపోడు	25,323	కొండమల్లేపల్లి	12,934	నాంపల్లి	22,694
నిడమనూరు	18,181	నేరెడుగొమ్ము	8,107	చిట్యాల	18,301
పెద్దవూర	19,309	పీఏపల్లి	20,967	కట్టంగూరు	17,600
తిరుమలగిరి సాగర్	15,984	అడవిదేవులపల్లి	5,368	కేతేపల్లి	13,467
త్రిపురారం	16,025	దామరచర్ల	12,126	నకిరేకల్	13,643
చందంపేట	12,709	మాడుగులపల్లి	16,898	నార్కట్‌పల్లి	17,685
చింతపల్లి	20,668	మిర్యాలగూడ	23,424	శాలిగౌరారం	18,731
దేవరకొండ	19,679	వేములపల్లి	10,778	కనగల్	19,704
		చండూరు	17,742	నల్లగొండ	26,339
		మర్రిగూడ	16,002	తిప్పర్తి	15,559

రైతుబంధు కింద రూ.622 కోట్లు

- రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ అగ్రికల్చర్ : వానాకాలం సీజన్ రైతుబంధు డబ్బులు ఈ నెల 26వ తేదీ నుంచి రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుందని రైతుబంధు సమితి జిల్లా కోఆర్డినేటర్ చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం నల్లగొండలోని సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం సీజన్‌కు ఎకరానికి రూ.5 వేల చొప్పున సంవత్సరానికి రూ.పది వేల పెట్టుబడిసాయం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందన్నారు. గత యాసంగి సీజన్‌లో 4,77,728 మందికి రైతులకు రూ.294,10,34,991 రైతుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో 5,29,531 మంది రైతులకు రూ.622 కోట్లను జమ చేయనుందని వెల్లడించారు. మొదటి రోజు ఎకరంలోపు ఉన్న రైతులకు తరువాత విడతల వారీగా నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమవుతాయని చెప్పారు.

హామీలన్నీ అమలు చేస్తాం



కేతేపల్లి వద్ద సాగుతున్న సీఎల్పీ నేత భట్టి విక్రమార్క పాదయాత్ర

- సీఎల్పీ నేత భట్టి విక్రమార్క
- కేతేపల్లి మండలంలో సాగిన పాదయాత్ర

కేతేపల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసి తీరుతామని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. భట్టి అస్వస్థతకు గురికావడంతో ఈ నెల 20వ తేదీన కేతేపల్లి వద్ద నిలిచిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర మూడు రోజుల విరామం అనంతరం 100వ రోజు శుక్రవారం తిరిగి ప్రారంభమైంది. కేతేపల్లి నుంచి చీకటిగూడెం, ఉప్పలపహాడ్ మీదుగా కొప్పోలు వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా చోట్ల భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని హామీ చ్చారు. కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నిర్బంద ఆంగ్ల విద్యను అందిస్తామన్నారు. రెండు గదుల ఇందిరమ్మ ఇల్లు కట్టుకునేందుకు రూ.5 లక్షలు ఇస్తామని చెప్పారు. పాదయాత్రలో సూర్యాపేట మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, పీసీసీ ప్రధాన కార్యదర్శి కొండేటి మల్లయ్య, టీపీసీసీ నేతలు దైద రవీందర్, ఎండీ.యూసుఫ్‌జానీ, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నలగాటి ప్రసన్నరాజ్, వేదాసు శ్రీధర్, కేతేపల్లి పీఏసీఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, ఎంపీపీ పెరుమాళ్ల శేఖర్, కె.శ్రీనివాస్‌యాదవ్, నకిరెకంటి మంగమ్మ, గార్లపాటి రవీందర్‌రెడ్డి, జటంగి వెంకటనర్సయ్యయాదవ్, కోట పుల్లయ్య, గాజుల సుకన్య, అల్లి అంజన్‌కుమార్‌యాదవ్, బయ్య ముత్తయ్య, ఎస్‌కే.లతీఫ్, ఎ.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలపహాడ్ వద్ద మహిళలతో ముచ్చటిస్తున్న భట్టి విక్రమార్క

ప్రజా సమస్యలు తెలుసుకున్న భట్టి..

పాదయాత్రలో భాగంగా భట్టి విక్రమార్క ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. చీకటిగూడెం వద్ద హైవే వెంట టిఫిన్ సెంటర్ నడుపుతున్న చింతం రామలింగం, విజయ దంపతులను బట్టి పలకరించారు. రుణమాఫీ కాకపోవడంతో.. వచ్చిన రైతు బంధు డబ్బులు వడ్డీ కింద బ్యాంకులో జమ చేసుకుంటున్నారని ఆ దంపతులు వాపోయారు. రెండెకరాల భూమి ఉన్నా పంటలతో లాభం లేకపోవడంతో రోడ్డు వెంట టిఫిన్ సెంటర్ నడుపుకుంటున్నామని చెప్పారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ రాకపోవడంతో పిల్లలను పెద్ద చదువులు చదవించ లేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఉప్పలపహాడ్ శివారులోని మిల్లులో పని చేస్తున్న హమాలీలు భట్టికి సమస్యలే ఏకరువు పెట్టారు. తమ పిల్లలు పెద్ద చదువులు చదివించినా ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయకపోవడంతో ఆటో నడుపుకుంటున్నారని తెలిపారు. ఉప్పలపహాడ్ బస్‌స్టేజీ వద్ద గొర్రెల పెంపకందారుడు నాగయ్య బట్టి విక్రమార్కకు గొంగడి, గొర్రె పిల్లను బహూకరించారు.

భట్టి పాదయాత్రకు వంద రోజులు పూర్తి

తెలంగాణలో ఇందిరమ్మ రాజ్యం తీసుకు రావాలని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారంతో వంద రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా కేతేపల్లి మండలం ఉప్పలపహాడ్ గ్రామంలో పాదయాత్ర శిబిరం వద్ద కాంగ్రెస్ శ్రేణులు టపాసులు పేల్చి సంబరాలు జరుపుకున్నాయి. మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, భట్టి సతీమణి మల్లు నందిని కేక్‌కట్ చేసి ఆయనకు తినిపించి శుబాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ ఖమ్మం నుంచి ఉప్పలపహాడ్ వద్దకు చేరుకుని పూలమాల, శాలువాతో భట్టిని సన్మానించారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, కిసాన్‌సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్‌రెడ్డి, సూర్యాపేట, హన్మకొండ జిల్లాల డీసీసీ అధ్యక్షులు చెవిటి వెంకన్న, నాయిని రాజేందర్ తదితరులు ఉన్నారు.



ఉప్పలపహాడ్ వద్ద కేక్ కట్ చేస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి, పక్కన భట్టి

బహిరంగ సభను విజయవంతం చేయాలి




సమావేశంలో పాల్గొన్న నాయకులు

నల్లగొండ టూటౌన్, కనగల్ : నల్లగొండలోని క్లాక్ టవర్ సెంటర్లో ఈనెల 26న నిర్వహించే బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ బహిరంగ సభ విజయవంతం చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి ప్రదీప్‌కుమార్ కోరారు. శుక్రవారం స్థానిక బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో, కనగల్ మండలంలోని దర్వేశిపురంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తొమ్మిది సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహిస్తున్న బహిరంగ సభకు యువత అధిక సంఖ్యలో హాజరయ్యేలా నాయకులు కృషి చేయాలన్నారు. ఈ సభ ద్వారా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తామన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, గోలి మధుసూదన్‌రెడ్డి, శ్రీదేవిరెడ్డి, నాగం వర్షిత్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, మొరిశెట్టి నాగేశ్వరరావు, కంకణాల నాగిరెడ్డి, బొజ్జ నాగరాజు, వెంకన్న, పులకరం భిక్షం, రాజశేఖర్‌రెడ్డి, కనకయ్య, రాంబాబు, శంకర్‌గౌడ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

డీలర్ చెప్పిందే రేటు..!

- రెట్టింపు ధరకు పత్తి విత్తన ప్యాకెట్ల విక్రయం
- పట్టించుకోని వ్యవసాయ శాఖ అధికారులు

మునుగోడు : ప్రభుత్వం విత్తన కంపెనీలకు సబ్సిడీలు ఇచ్చి రైతులకు అందుబాటులో ఉండే విధంగా ధరలు నిర్ణయించి విత్తనాలు విక్రయించాలని విత్తన కంపెనీలను ఆదేశించింది. అంతే కాకుండా ఎరువులు, ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయశాఖ, పోలీస్‌శాఖ అధికారులతో విస్తృతంగా తనిఖీలు చేయిస్తోంది. అయినా మునుగోడులో మాత్రం దుకాణదారులు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. లాభార్జనే ధ్యేయంగా కొందరు విత్తన, ఫర్టిలైజర్ వ్యాపారులు రైతులు అధికంగా కోరుకుంటున్న పత్తి విత్తనాలను రెట్టింపు ధరలకు విక్రయిస్తున్నారు.



రూ.1600కు విక్రయిస్తున్న యూ.ఎస్ 7067 పత్తి విత్తనాల ప్యాకెట్

అధిక దిగుబడి అంటూ ప్రచారం..

మార్కెట్‌లో అనేక కంపెనీల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నా, యూ ఎస్ 7067 రకం విత్తనాలు అధిక దిగుబడి వస్తుందని మునుగోడు ప్రాంతంలో ప్రచారం సాగుతోంది. దీంతో రైతులు ఆ కంపెనీ విత్తనాలును మాత్రమే కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆ విత్తనాల కంపెనీ ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా ఐదుగురికి మాత్రమే డీలర్‌షిప్ ఇచ్చింది. అందులో మునుగోడుకు చెందిన ఒక వ్యాపారికి డీలర్‌షిప్ వచ్చింది. విత్తనాలకు డిమాండ్ భారీగా ఉండడంతో రైతుల నుంచి ఆ డీలర్ అందినకాడికి దోచుకుంటున్నాడు. ఒక్కో ప్యాకెట్ రూ.852కి విక్రయించాల్సి ఉండగా.. రూ.1600 తీసుకుంటున్నట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ఎవరైనా ప్రశ్నిస్తే ఇష్టం ఉంటే తీసుకోండి లేకుంటే వెళ్లిపోండని సదరు వ్యాపారి దురుసుగా మాట్లాడుతున్నాడని రైతులు పేర్కొంటున్నారు. ఇంత జరుగుతున్నా ఆ వ్యాపారిపై సంబంధిత అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో రైతులు చేసేది ఏమీలేక ఆ డీలర్ చెప్పిన ధరకు విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకుని అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై చర్యలు తీసుకుని రైతులపై ఆర్థిక భారం పడకుండా చూడాలని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

తెలంగాణ పథకాలు భేష్



జార్ఖండ్ ప్రతినిధులతో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తా తదితరులు

- జార్ఖండ్ ప్రతినిధుల బృందం కితాబు

రామగిరి(నల్లగొండ) : తెలంగాణ రాష్ట్రంలో పరిపాలన విధానం, ప్రజలకు అందిస్తున్న పథకాలు బాగున్నాయని జార్ఖండ్ రాష్ట్ర ప్రతినిధుల బృందం కితాబిచ్చింది. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు తీరుపై అధ్యయనం చేసేందుకు జార్ఖండ్ రాష్ట్ర జెడ్పీ చైర్మన్లు, వైస్ చైర్మన్లు, అధికారుల బృందం శుక్రవారం నల్లగొండ జిల్లాలో పర్యటించింది. జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ ఖుష్బూ గుప్తాతో సమావేశమైంది. వారికి ప్రభుత్వ పథకాలు, పరిపాలన విధానాన్ని శాఖల వారీగా పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సందర్భంగా జార్ఖండ్ బృందం సభ్యులు మాట్లాడుతూ తెలంగాణలో విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ వంటి పథకాల పనితీరు మెరుగ్గా ఉందని కొనియాడారు. ఇలాంటి పథకాలు జార్ఖండ్‌లో కూడా అమలయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, వంగూరి లక్ష్మయ్య, సీఈఓ ఎస్.ప్రేమ్‌కరణ్‌రెడ్డి, జార్ఖండ్‌కు చెందిన ఎన్‌ఐఆర్‌డీ ప్రొఫెసర్లు తకీయుద్దీన్, డాక్టర్ ఎకె బాంజు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ మునీష్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాస్‌నగర్ గ్రామం సందర్శన



శ్రీనివాస్‌నగర్‌లోని పల్లె ప్రకృతివనంలో జార్ఖండ్ ప్రజా ప్రతినిధులు

మిర్యాలగూడ : జార్ఖండ్‌కు చెందిన ప్రతినిధుల బృందం శుక్రవారం మిర్యాలగూడ నియోజకవర్గంలోని శ్రీనివాస్‌నగర్ గ్రామాన్ని సందర్శించింది. గ్రామంలోని పల్లె ప్రకృతివనం, డంపింగ్‌యార్డు, కంపోస్టు షెడ్‌లో వ్యర్థాలతో కంపోస్ట్ ఎరువు తయారీ, గ్రంథాలయం, ఓపెన్ జిమ్, ఎవెన్యూ ప్లాంటేషన్, అంతర్గత సీసీ రోడ్లు, గ్రామంలో పారిశుద్ధ్యాన్ని పరిశీలించింది. గ్రామంలో అభివృద్ధి పనులు, ఆదాయ వనరులు, గ్రామంలో బాలికలకు ప్రత్యేకంగా కరాటే క్లాసులు, నృత్య శిక్షణ, రైతువేదిక ఉపయోగాలను ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డిని, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, సర్పంచ్ భోగవెల్లి వెంకటరమణచౌదరిని అడిగి తెలుసుకుంది. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, ఎంపీఓ టీ.వీరారెడ్డి, పంచాయతీ కార్యదర్శి గజ్జల అనితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి విద్యార్థులకు రాగిజావ

- ప్రభుత్వ పాఠశాలల్లో వారానికి మూడు రోజులు పంపిణీ

నల్లగొండ : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇప్పటికే మధ్యాహ్నం భోజన పథకాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం జూలై 1వ తేదీ నుంచి రాగి జావ అందజేయనుంది. మన ఊరు – మన బడి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్న ప్రభుత్వం విద్యార్థులపై ఆరోగ్యంపై దృష్టి పెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులు చాలా మందికి సరైన పౌష్టికాహారం అందడం లేదని గుర్తించి.. వారికి ఉదయం పూట గ్లాసు రాగి జావను బెల్లం పొడి కలిపి అందజేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలోని 1483 ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 88,402 మంది మంది విద్యార్థులకు పౌష్టికాహారం అందనుంది.



బెల్లం పొడి, రాగి పిండి ప్యాకెట్లు

విద్యార్థుల వివరాలు ఇలా..

ప్రాథమిక పాఠశాలలు	ప్రాథమికోన్నత	ఉన్నత
41,687	10,713	36,002

వారానికి మూడు రోజులు..

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు అర్ధాకలితో ఉండకుండా, డ్రాప్ అవుట్స్ నివారించేందుకు ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోంది. మధ్యాహ్న భోజనానికి ప్రత్యేక మెనూ రూపొందించి.. నాణ్యమైన భోజనం అందించేలా చర్యలు తీసుకుంటోంది. వారానికి మూడు రోజులు కోడి గుడ్డు సైతం పెడుతున్నారు. ఇప్పుడు మిగతా మూడు రోజులు రాగి జావ అందించనుంది. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండి తరగతి గదిలో ఉపాధ్యాయుడు చెప్పే పాఠాలను శ్రద్ధగా వింటారని ప్రభుత్వం భావిస్తోంది.

20వ తేదీన ప్రారంభం..

తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 20వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా రాగి జావా పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. జిల్లాలో విద్యా దినోత్సవం సందర్భంగా మంత్రి జగదీష్‌రెడ్డి నల్లగొండలో ప్రారంభించారు. జూలై 1వ తేదీ నుంచి అన్ని పాఠశాలలో పూర్తిస్థాయిలో రాగిజావ అందించనున్నారు.

క్లుప్తంగా

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

వలిగొండ: తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి తీవ్రగాయాలైన ఘటన వలిగొండ మండలంలోని రెడ్లరేపాక గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డరేపాక గ్రామానికి చెందిన గీత కార్మికుడు జువ్వగాని రాములు రోజుమాదిరిగా గురువారం కూడా గ్రామ సమీపంలో కల్లు గీసేందుకు తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు గమనించి అతడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడిని ప్రభుత్వపరంగా ఆదుకోవాలని పలువురు గీతకార్మిక సంఘం నాయకులు కోరారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు


షఫియా

హుజూర్‌నగర్: పట్టణంలోని దద్దనాలచెరువు కాలనీకి చెందిన యువతి అదృశ్యమైనట్లు శుక్రవారం ఫిర్యాదు అందిందని ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. దద్దనాలచెరువు కాలనీకి చెందిన షేక్ రిహానా, ఖాజామియా దంపతులకు కుమారుడు, కుమార్తె షేక్ షఫియా సంతానం. షఫియా ఇంటి వద్దనే ఉంటోంది. కాగా గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో షఫియా బ్యాగులో బట్టలు సర్దుకుని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. చుట్టుపక్కల ఎంత వెతికినా షఫియా ఆచూకీ లభించకపోవడంతో శుక్రవారం ఆమె తండ్రి ఖాజామియా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

వలిగొండ: మండల కేంద్రంలోని బీసీ కాలనీలో మధుగాని దాసు ఇంట్లో శుక్రవారం రాత్రి 8మంది వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారా అందడంతో ఎస్‌ఐ ప్రభాకర్ ఆధ్వర్యంలో పోలీసులతో దాడి చేసి వారిని అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి రూ.14,790 నగదు, 6 సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నాలుగు వ్యవసాయ మోటార్లు చోరీ

గరిడేపల్లి: మండలంలోని తాళ్లవాగు వద్ద రైతులు ఏర్పాటు చేసుకున్న నాలుగు వ్యవసాయ మోటార్లను శుక్రవారం గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. ఆటోలో వచ్చిన వరుసగా ఉన్న మోటార్లను దొంగిలించారని బాధిత రైతులు పెండెం అరవింద్, బండా నర్సిరెడ్డి, అనంతు నరసయ్య తెలిపారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యే సమయంలో వ్యవసాయ మోటార్లపై పోలీసులు నిఘా పెట్టాలని కోరారు.

విధి రాత.. కన్నోళ్లకు కడుపుకోత

- కష్టాలు తీరుస్తాడనుకున్న కుమారుడు పిడుగుపాటుకు గురై మృతి
- కాలుకి శస్త్రచికిత్స జరిగి మంచానికే పరిమితమైన తండ్రి
- పేద కుటుంబానికి బాసట కరువు

మాడుగులపల్లి: పేదరికాన్ని సైతం లెక్క చేయకుండా మనోధైర్యంతో కష్టాల కడలిని ఈదుతున్నారు ఆ దంపతులు. తమ ఇబ్బందులను చూసి అత్యుత్తమంగా చదువుతూ పనిలోనూ చేదోడు వాదోడుగా ఉంటున్న కుమారుడిని చూసి పొంగిపోయారు. కానీ ఆ సంతోషం ఎంతో కాలం నిలువ లేదు. విధి వారికి కడుపుకోతను మిగిల్చింది. పిడుగు రూపంలో కుమారుడిని బలిగొనడంతో కన్నవారు తామెరికోసం బతకాలంటూ.. తమకిక దిక్కెవరంటూ రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తోంది. మాడుగుపల్లి మండలం పాములపహాడ్ గ్రామానికి చెందిన లింగయ్య, లక్ష్మి దంపతులకు కుమారుడు, కుమార్తె సంతానం. కుమారుడు గోపి(21) డిగ్రీ ఫైనలియర్, కుమార్తె ఇంటర్ చదువుతున్నారు. గోపి మొదటి నుంచి చదువుల్లో చురుకు. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదివి 8.7 జీపీఏ సాధించాడు. ఇంటర్‌లోనూ 750 మార్కులు సాధించాడు. సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కళాశాలలో డిగ్రీ చదువుతూ సెలవు రోజుల్లో తండ్రికి పనుల్లో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఏడాది క్రితం తండ్రి లింగయ్యకు రోడ్డు ప్రమాదంలో గాయపడగా, కాలుకు శస్త్రచికిత్స జరిగడంతో మంచానికే పరిమితమయ్యాడు. అప్పటి నుంచి తమకున్న రెండెకరాల భూమిలో వ్యవసాయం, జీవాల పెంపకం తదితర పనులన్నీ గోపినే చూసుకుంటున్నాడు. ఈ నెల 20వ తేదీన పక్కింటి వ్యక్తితో కలిసి గోపి గొర్రెల మందను మేపేందుకు తోలుకెళ్లాడు. సాయంత్రం ఒక్కసారిగా ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభంకావడంతో ఇద్దరు సమీపంలోని చెట్టు కిందకు వెళ్లగా పక్కనే పిడుగుపడి గోపి మృతిచెందాడు. ఊహించని ఈ ఘటన నుంచి ఆ తల్లిదండ్రులు తేరుకోలేకపోతున్నారు. ఓ వైపు భర్త మంచాన పడడం.. చేతికొచ్చిన కుమారుడు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో ఆ కన్నతల్లి వేదన వర్ణనాతీతంగా మారింది. వృద్ధాప్యంలో తమకెవరు దిక్కంటూ తల్లిదండ్రులు రోదిస్తున్న తీరు గ్రామస్తులను కంటతడి పెట్టిస్తోంది. పుట్టెడు కష్టంలో ఉన్న నిరు పేద కుటుంబానికి ప్రభుత్వం, దాతలు బాసటగా నిలువాలని గ్రామస్తులు కోరుతున్నారు.


కుటుంబ సభ్యులతో గోపి (ఫైల్)

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

నిడమనూరు: నిర్మాణంలో ఉన్న కెనాల్ బ్రిడ్జి వద్ద నైట్ వాచ్‌మన్‌గా ఉన్న వ్యక్తిని ట్రాక్టర్ ఢీకొట్టడంతో తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. ఎస్‌ఐ శోభన్‌బాబు తెలిపిన వివరా ప్రకారం.. నిడమనూరు మండలం తుమ్మడం గ్రామానికి చెందిన ఆకుల రాములు (66) గ్రామ సమీపంలో నిర్మాణంలో ఉన్న కెనాల్ బ్రిడ్జి వద్ద గురువారం రాత్రి నైట్ వాచ్‌మన్‌గా ఉన్నాడు. ఈ క్రమంలో అర్ధరాత్రి 2గంటల సమయంలో ముకుందాపురం నుంచి నారమ్మగూడెం వైపు వెళ్తున్న ట్రాక్టర్(టీఎస్ 05 యూడీ 8799) డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా వచ్చి బ్రిడ్జి వద్ద కూర్చొని ఉన్న ఆకుల రాములును ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రాములుకు రెండు కాళ్లు విరిగాయి. రాములు బంధువు అదే సమయంలో అటుగా వెళ్తూ గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. వారు రాములును మిర్యాలగూడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడి కుమారుడు ఆకుల శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.


రాములు మృతదేహం

హత్య కేసులో ఎనిమిది మందికి జీవిత ఖైదు

రాజాపేట: హత్య కేసులో ఒకే కుటుంబానికి చెందిన 8మందికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ భువనగిరి 1వ అదనపు జిల్లా జడ్జి మారుతీదేవి శుక్రవారం తీర్పు వెల్లడించినట్లు ఎస్‌ఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ తెలిపిన వివరాల ప్రకారం.. రాజాపేట మండలంలోని చల్లూరు గ్రామంలో ఒకే కుటుంబానికి చెందిన చెట్కూరి అయిలయ్య, నర్సయ్య, కుమార్, యాదగిరి, స్వామి, అరుణ, లక్ష్మి(భర్త నర్సయ్య), లక్ష్మి(భర్త అయిలయ్య)కి అదే గ్రామంలో మరో కుటుంబానికి చెందిన చెట్కూరి అయిలయ్య మధ్య ఇంటి గోడ విషయంలో తగాదా చోటుచేసుకుది. ఈ నేపథ్యంలో 1 ఏప్రిల్, 2020న పైన పేర్కొన్న 8మంది కుటుంబ సభ్యులు కలిసి చెట్కూరి అయిలయ్యను హత్య చేశారని అప్పటి సీఐ నర్సయ్య కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ అనంతరం శుక్రవారం భువనగిరి 1వ అదనపు జిల్లా జడ్జి ఎనిమిది మంది నిందితులకు జీవిత ఖైదుతో పాటు ఒక్కొక్కరికి రూ. 4500 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. జీవిత ఖైదు పడిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారే కావడంతో వారి పిల్లలు శోకసంద్రంలో మునిగిపోయారు. వీరంతా గొర్లు కాసుకుంటూ కూలీ పని చేసుకుని జీవించేవారు. యాదగిరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్‌కు ఒక బాబు, పాప ఉన్నారు.

భూతగాదాలో వ్యక్తికి గాయాలు

భూదాన్‌పోచంపల్లి: భూతగాదాలో ఒకరి తలకు గాయాలైన సంఘటన శుక్రవారం పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని రేవనపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. రేవనపల్లి గ్రామానికి చెందిన రావుల కిష్టయ్యకు, అతడి సోదరుడికి మధ్య చాలా ఏళ్లుగా భూ వివాదం కొనసాగుతుంది. శుక్రవారం ఉదయం గ్రామంలో పెద్దమనుషుల సమక్షంలో భూ వివాదాన్ని పరిష్కరించుకునేందుకు సమావేశమయ్యారు. ఈ క్రమంలో కిష్టయ్యకు, అతడి సోదరుడు రావుల అయిలయ్య మధ్య వాగ్వాదాం జరిగింది. దీంతో కోపోద్రిక్తులైన రావుల అయిలయ్య కుమారులు యాదయ్య, రాజు, రమేష్ కలిసి రాయితో కిష్టయ్య తలపై కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. గాయపడిన కిష్టయ్యను చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.


గాయపడిన రావుల కిష్టయ్య

వ్యక్తిపై కర్రలతో దాడి.. ఇద్దరిపై కేసు

పెన్‌పహాడ్: తన భూమిని అక్రమంగా దున్నుతున్న వారిని అడ్డుకున్న వ్యక్తిపై దాడి చేసి గాయపర్చిన ఘటన పెన్‌పహాడ్ మండల పరిధిలోని సింగారెడ్డిపాలెం గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఏఎస్‌ఐ వెంకటరత్నం తెలిపిన వివరాల ప్రకారం.. సింగారెడ్డిపాలెం గ్రామానికి చెందిన పేర్ల మల్లయ్య తన కుమార్తె మౌనికను చివ్వెంల మండలం గుంజలూరు గ్రామానికి చెందిన వీరబోయిన నరేష్‌కి ఇచ్చి 2018లో వివాహం జరిపించాడు. వివాహ సమయంలో కూతురుకు 1.20 ఎకరాల వ్యవసాయ భూమిని కట్నం కింద ఇస్తానని ఒప్పుకున్నాడు. అయితే తన కూతురు మౌనికను అల్లుడు నరేష్ వేధిస్తుండడంతో భూమిని పట్టా చేయలేదు. నరేష్‌తో పాటు అతడి తండ్రి వెంకన్న శుక్రవారం ట్రాక్టర్‌తో దౌర్జన్యంగా తన పొలాన్ని దున్నుతుండడంతో అడ్డుకునేందుకు వెళ్లిన మల్లయ్యపై కర్రలతో దాడి చేశారు. మల్లయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు నరేష్, వెంకన్నపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఇసుక ట్రాక్టర్


విరిగిన విద్యుత్ స్తంభం

నూతనకల్: ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగిన ఘటన నూతనకల్ మండల పరిధిలోని బక్కహేమ్లాతండా గ్రామపంచాయతీ పరిధిలో శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. తండావాసులు తెలిపిన వివరాల ప్రకారం.. అర్వపల్లి మండలంలోని మూసీ నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ రోడ్డు వెంబడి ఉన్న 11కేవీ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో విద్యుత్ స్తంభం విరిగింది. విద్యుత్ వైర్లు పక్కనే ఉన్న చెట్ల కొమ్మలపై పడడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఢీకొట్టిన ట్రాక్టర్ వెళ్లిపోవడంతో తండావాసులు రోడ్డు వెంబడి వెళ్లే మిగతా ఇసుక ట్రాక్టర్లను నిలిపి ప్రమాదానికి కారణమైన ట్రాక్టర్ సమాచారం ఇవ్వాలని వాగ్వాదానికి దిగారు. ట్రాక్టర్ యాజమానిపై చర్యలు తీసుకోవాలని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

గుర్రంపోడు: ఆర్థిక ఇబ్బందులతో పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్న వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కనగల్ మండలంలోని పగిడిమర్రి గ్రామానికి చెందిన గడగోటి అశోక్ (36) గుర్రంపోడు మండలంలోని చామలేడు గ్రామంలో ఉంటున్న తన చెల్లెలు ఇంటికి ఈ నెల 21న వచ్చాడు. అతడి తల్లి కూడా ఇక్కడే ఉండటంతో వారిద్దరితో తన ఆర్థిక ఇబ్బందులు చెప్పుకుని బాధపడ్డాడు. తర్వాత ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు గమనించి నల్ల గొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, తొమ్మిది నెలల వయస్సు బాబు ఉన్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

- ఇంటి యజమాని నిర్లక్ష్యమే కారణమంటూ బంధువుల ఆందోళన

చివ్వెంల (సూర్యాపేట): విద్యుదాఘాతంతో మహిళ మృతిచెందిన ఘటన చివ్వెంల మండల పరిధిలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన గింగిరాల రాజ్యలక్ష్మి ఇంట్లో పసునూరి జానమ్మ(42) అద్దెకు ఉంటుంది. శుక్రవారం జానమ్మ ఇంట్లో దుస్తులు తీస్తుండగా వర్షానికి ఇంట్లోని రేకులకు విద్యుత్ సరఫరా అయ్యి విద్యుత్ షాక్‌తో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. కాగా జానమ్మ అద్దెకు ఉన్న రూంలో గత కొన్నిరోజులుగా పలు వస్తువులకు విద్యుత్ షాక్ వస్తుందని ఇంటి యజమానికి చెప్పినా ఆమె పట్టించుకోలేదని, ఇంటి యజమాని నిర్లక్ష్యం తోనే జానమ్మ చనిపోయిందని కుటుంబ సభ్యులు, బంధువులు ఆందోళన చేపట్టారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ విష్ణుమూర్తి తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.


పసునూరి జానమ్మ (ఫైల్)

ఎంపీటీసీ భర్త కారు ధ్వంసం

తుర్కపల్లి: మండల కేంద్రంలో నివాసముంటున్న ఎంపీటీసీ సభ్యురాలు వనజ భర్త హన్మంత్‌రెడ్డి కారును శుక్రవారం తెల్లవారుజామున వారి ఇంటి పక్కన నివాసముండే వ్యక్తి ధ్వంసం చేశాడు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. తుర్కపల్లి మండల కేంద్రంలోఎంపీటీసీ సభ్యురాలు వనజ ఇంటి పక్కనే డొంకెన జంగయ్య అనే వ్యక్తి నివాసముంటున్నాడు. వనజ భర్త హన్మంత్‌రెడ్డి గురువారం రాత్రి తమ కారును తమ ఇంటి ముందు పార్కింగ్ చేశాడు. కాగా శుక్రవారం తెల్లవారుజామున 4గంటల సమయంలో జంగయ్య హన్మంత్‌రెడ్డి కారుపై రాళ్లు వేసి అద్దాలు, డోర్లు ధ్వంసం చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కారు అద్దాలు ధ్వంసమై ఉండడంతో హన్మంత్‌రెడ్డి స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.


ధ్వంసమైన కారు

ఇంట్లో దాచిన రూ.60 లక్షలు చోరీ

- బాధితుడి బంధువే నిందితుడు..?

బొమ్మలరామారం: ఇంట్లో దాచిన రూ.60 లక్షలు చోరీకి గురైన సంఘటన బొమ్మలరామారం మండలంలోని తిర్మలగిరి గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. తిర్మలగిరి గ్రామానికి చెందిన ధరావత్ బిచ్చాలునాయక్ మూడు నెలల క్రితం తన భూమిని సుమారు కోటి రూపాయలకు విక్రయించాడు. అందులో తన కూతురు పెళ్లికి రూ.30లక్షలు ఖర్చు చేయగా, మిగతా డబ్బును సంచిలో పెట్టి ఇంట్లోనే సజ్జపై దాచాడు. కాగా గురువారం సాయంత్రం సజ్జపై ఉంచిన డబ్బుల సంచి కనబడకపోవడంతో బిచ్చాలునాయక్ వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. అయితే బిచ్చాలునాయక్ బంధువైన ఓ యువకుడు డబ్బుల సంచిని తీసుకెళ్లినట్లు చూశామని స్థానికులు పోలీసులుకు చెప్పారు. దీంతో పోలీసులు సదరు యువకుడిని పట్టుకొని విచారించగా నిజం ఒప్పుకున్నట్లు సమాచారం. నిందితుడి వద్ద రికవరీ చేసిన నగదుతో పాటు నిందితుడు పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలిసింది.

పెట్రోల్ బంక్‌లో స్వైపింగ్ మోసం

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని దేవరకొండ రోడ్డులో గల ఓ పెట్రోల్ బంక్‌లో వినియోగదారుల క్రెడిట్ కార్డు ద్వారా అధికంగా డబ్బులు స్వైపింగ్ చేసిన ఘటన శుక్రవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలు.. నల్లగొండ పట్టణానికి చెందిన శిరీష మే 28న, నిమ్మల శ్రీనివాస్‌రెడ్డి జూన్ 15 తమ వాహనాల్లో రూ.1500 పెట్రోల్ పోయించుకున్నారు. క్రెడిట్ కార్డు ద్వారా పేమేంట్ చేసే క్రమంలో బంకులో పనిచేసే ఉద్యోగి మూడు సార్లు రూ.1500 చొప్పున కార్డును స్వైపింగ్ చేసి ఒక స్లిప్ ఇచ్చాడు. ఒక సారి మాత్రమే డబ్బులు కట్ అయ్యాయని అనుకొని వారు వెళ్లిపోయారు. కొన్ని రోజుల తర్వాత వారు బ్యాంక్ స్టేట్‌మెంట్ చూసుకోగా మూడు సార్లు డబ్బులు కట్ కావడంతో అవాక్కయ్యారు. శుక్రవారం బంక్ వద్దకు వచ్చి నిర్వాహకులను నిలదీశారు. దీంతో డబ్బులు తిరిగి ఇచ్చేశాడు. ఇలా ఎంత మంది వాహనదారుల వద్ద అధికంగా డబ్బులు స్వైపింగ్ చేశారనేది తెలియాల్సి ఉంది.

లారీని ఢీకొట్టిన డీసీఎం.. వ్యక్తి దుర్మరణం

నల్లగొండ క్రైం: రోడ్డుపై ఆగి ఉన్న పాట్టు లారీని వెనుక నుంచి డీసీఎం ఢీకొట్టడంతో ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి–అద్దంకి రహదారిపై నల్లగొండ పట్టణ పరిధిలోని పానగల్ బైపాస్ వద్ద గురువారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. నల్లగొండ టూటౌన్ ఎస్‌ఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. త్రిపురారం మండలంలోని కొనతాలపల్లి గ్రామానికి చెందిన అబ్బుమియా(65) మిర్యాలగూడలోని ఆర్‌ఎస్‌వీ రైస్ మిల్లు నుంచి డీసీఎంలో బియ్యం లోడుతో హైదరాబాద్‌కు వెళ్తున్నాడు. ఈ క్రమంలో పానగల్ బైపాస్ సమీపంలో హైదరాబాద్ వెళ్లే వైపు రోడ్డుపై ఆగి ఉన్న లారీని డీసీఎంతో వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అబ్బుమియా అక్కడికక్కడే మృతిచెందాడు. శుక్రవారం మృతుడి కుమారుడు రఫీక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అక్రమంగా తరలిస్తున్న ఆవుల పట్టివేత

భూదాన్‌పోచంపల్లి: అక్రమంగా తరలిస్తున్న ఆవులను శుక్రవారం తెల్లవారుజామున భూదాన్‌పోచంపల్లి మండలంలోని పిల్లాయిపల్లి గ్రామ శివారులో పోలీసులు పట్టుకున్నారు. సీఐ మహేష్, ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజ మండ్రితో పాటు తెలంగాణలోని మహబూబాబాద్‌లో 131 ఆవులు, కోడెలను కొనుగోలు చేసి రెండు డీసీఎంలు, బొలెరో వాహనంలో వాటిని హైదరాబాద్‌కు తరలిస్తుండగా పిల్లాయిపల్లి గ్రామ శివారులో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు పట్టుకున్నారు. పట్టుబడ్డ ఆవులను హైదరాబాద్‌లోని గోశాలకు తరలించారు. వాహనాలను సీజ్ చేశారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

50 ఎద్దుల పట్టివేత..

బీబీనగర్: మండల పరిధిలోని బట్టుగూడెం గ్రామం గుండా హైదరాబాద్‌కు అక్రమంగా తరలిస్తున్న 50 ఎద్దులను బీబీనగర్ పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. ఎస్‌ఐ యుగేంధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒరిస్సా రాష్ట్రానికి చెందిన వ్యక్తులు బక్రీద్ పండుగ సందర్భంగా డీసీఎంలో 50ఎద్దులను గ్రామీణ ప్రాంతాల మీదుగా హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో బట్టుగూడెం గ్రామ పరిధిలో పోలీసులు వాహనాలను తనిఖీల్లో భాగంగా పట్టుకున్నారు. ఎద్దులను రాజాపేటలోని గోశాలకు తరలించగా అందులోని ఓ ఎద్దు ఊపిరాడక అప్పటికే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసి డీసీఎంను, నిందితులను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా పరిమితికి మించి మూగజీవాలను వాహనాల్లో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదంటూ గూడూరు టోల్‌ప్లాజా వద్ద శుక్రవారం భజరంగ్‌దళ్ నాయకులు వాహనాలను ఆపి ఆందోళన చేపట్టారు. పోలీసులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎస్‌ఐ యుగేంధర్ వెటర్నరీ వైద్యులను పిలిపించి మూగజీవాలను వాహనాల్లో తరలించే సంఖ్యా పరిమితిపై సర్టిఫికెట్లను జారీ చేసి వాహనాలను అక్కడి నుంచి పంపించారు.


డీసీఎంలో ఆవులు

పోలీస్ స్టేషన్‌లో పూజలు..!


కోదాడ పట్టణ సీఐగా రాము శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా త్రిశక్తి శాంభవి పీఠం అధిపతి, వేదపండితుడు విష్ణుభొట్ల హరిప్రసాద్ శర్మ పోలీస్ స్టేషన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించి, దుర్గామాత ఆశీస్సులు ఉండాలని సీఐని ఆశీర్వదించారు. - కోదాడ రూరల్

సకల వసతులతో సర్కార్ బడి

- భీమనపల్లి పాఠశాలలో అధునాతన సౌకర్యాలు
- ప్రభుత్వ పాఠశాల వైపే ఆసక్తి చూపుతున్న విద్యార్థులు
- అభినందించిన ఉన్నతాధికారులు

భూదాన్‌పోచంపల్లి: సకల వసతులతో తీర్చిదిద్దిన సర్కార్ బడి పిల్లలకు ఆహ్లాదాన్ని పంచుతోంది. యాదాద్రి భువనగిరి జిల్లా భూదాన్ పోచంపల్లి మండలంలోని భీమనపల్లి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలను మన ఊరు–మన బడి కింద సుందరంగా తీర్చిదిద్దారు. గతంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలకు పంపించేవారు. దాంతో మూడేళ్ల క్రితం విద్యార్థులు లేక పాఠశాల మూతపడేదశకు చేరుకొంది. గ్రామస్తులు, ఉపాధ్యాయులు తల్లిదండ్రులను చైతన్యం చేసి బడీడు పిల్లలను బడిలో చేర్పించి, తిరిగి బడిని నిలబెట్టారు. ప్రస్తుతం 70 మంది విద్యార్థులు చదువుకొంటున్నారు.

ప్రత్యేక ఆకర్షణగా పచ్చని లాన్..

మన ఊరు–మన బడి కింద రూ.7 లక్షల వ్యయంతో అధునాతన బెంచీలు, స్లాబ్‌పైన ఫ్లోరింగ్, అన్ని తరగతులకు కరెంట్ సౌకర్యం, తాగునీరు, రీడింగ్ రూమ్, వంట గది, బాలబాలికలకు వేర్వేరుగా మూత్రశాలలు నిర్మించారు. పాఠశాల భవనానికి రంగులు వేసి తీర్చిదిద్దారు. ఇదే పాఠశాలలో చదువుకొన్న పూర్వ విద్యార్థి, ప్రస్తుత వైస్ ఎంపీపీ పాక వెంకటేశ్ సొంతంగా సుమారు రూ.లక్ష ఖర్చుచేసి పాఠశాల ఆవరణలో పచ్చని లాన్ ఏర్పాటు చేశారు. దాంతో పాఠశాల కొత్త అందాలను సంతరించుకొంది. పచ్చని గార్డెన్ విద్యార్థులకు ఆహ్లాదాన్ని పంచుతోంది.


పాక వెంకటేశ్, దాత

ఉన్నతాధికారులచే ప్రశంసలు

ఇటీవల కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ జాయింట్ కమిషనర్ అమర్‌ప్రీత్ దుగ్గల్, రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ వాకాటి కరుణ ఈ పాఠశాలను సందర్శించారు. పచ్చని లాన్, చెట్లతో పాఠశాలను తీర్చిదిద్దిన తీరును చూసి అభినందించారు. ఇదే మాదిరిగా అన్ని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దితే బాగుంటుందని అభిప్రాయ పడ్డారు. అలాగే పచ్చని లాన్‌తో తీర్చిదిద్దిన పాఠశాల ఫొటోలను కేసీఆర్ చూసి అభినందించారని సమాచారం. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా తీర్చిదిద్ది న పాఠశాల జిల్లాలోనే ఆదర్శంగా నిలవడం గమనార్హం.


ఆహ్లాదాన్ని పంచుతున్న పచ్చని పాఠశాల ఆవరణ


లాన్‌లో ఆడుకుంటున్న విద్యార్థినులు


విద్యార్థులు చేతులు కడుక్కోవడానికి ఏర్పాటు చేసిన నల్లాలు


తరగతి గదిలో ఏర్పాటు చేసిన డెస్క్ బెంచీలు

స్కూల్ బాగుంది



డెస్క్ బెంచీలు, బయట ఆడుకోవడానికి పచ్చని గార్డెన్, తాగడానికి మంచి నీళ్లు, అన్ని వసతులతో ఇప్పుడు స్కూల్ బాగుంది. చదువుకోవడానికి మంచి వాతావరణం ఉంది. గతంలో నేను పోచంపల్లిలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో చదువుకొనేది. 4వ తరగతి గవర్నమెంట్ స్కూల్‌లో చేరాను. పుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చారు. – దీపిక, 7వ తరగతి

సుందరంగా తీర్చిదిద్దాం



మొదటి విడత మన ఊరు–మన బడి కింద మాస్కూల్ ఎంపికైంది. దాంతో రూ.7లక్షల వ్యయంతో పాఠశాలను సకల సౌకర్యాలతో సుందరంగా తీర్చిదిద్దాం. దాంతో ఇప్పుడు తల్లిదండ్రులు పిల్లలను ఇదే స్కూల్‌కు పంపిస్తున్నారు. తరగతి గదుల్లో అధునాతనమైన బండలు వేయడానికి రూ.4 లక్షలు మంజూరు చేయాలని కోరుతున్నాం. ఇటీవల ఉన్నతాధికారుల దృష్టికి కూడా తీసుకెళ్లాం. – కంటె రాములుయాదవ్, సర్పంచ్, భీమనపల్లి

అధునాతన వసతులు



మన ఊరు–మన బడి కింద పాఠశాలలో అధునాతన వసతులు కల్పించబడ్డాయి. పిల్ల లు చదువుకోవడానికి మంచి వాతావరణం ఏర్పడింది. కరోనా తరువాత బడిలో ఒక్కసారిగా పిల్లలు తగ్గిపోయారు. దాంతో గ్రామస్తులు, సర్పంచ్ సహకారంతో పిల్లలను బడిలో చేర్పిస్తున్నాం. ప్రస్తుతం 70 వరకు పిల్లలు ఉన్నారు. మరింత పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నాం. – నర్సింహ, ప్రధానోపాధ్యాయుడు